
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
ఆదివారం 12 అక్టోబరు 2025



ఆరు దుకాణాలకు 8 దరఖాస్తులు

మోమిన్‌పేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో 6 మద్యం దుకాణాలకు మర్పల్లిలో ఓపెన్ కేటగిరిలో 1 దుకాణానికి 3, ఎస్టీ కేటగిరిలోని దుకాణానికి 3, బంట్వారంలోని ఒక మద్యం దుకాణానికి 2 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సహదేవుడు తెలిపారు. మోమిన్‌పేట్, ఎన్కతలలోని మూడు మద్యం దుకాణాలకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 8 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.


తాండూరులో కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

ఘనంగా కరసేవకుల కవాతు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని హిందూ సమాజాన్ని జాగృతం చేసేందుకు శనివారం వికారాబాద్, తాండూరులో పథ సంచలన్(కవాతు) కార్యక్రమాన్ని నిర్వహించారు. తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రధాన వీధుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 800 మంది ఆర్ఎస్ఎస్ సేవకులు ఈ కవాతులో పాల్గొన్నారు. పలుచోట్ల పూలు చల్లుతూ స్వాగతం చెప్పారు. యావత్ హిందూ సమాజాన్ని జాగృతం చేసి వారిలో విశ్వాసాన్ని నింపేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సంఘ్ ప్రముఖులు తెలిపారు.

-తాండూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి)


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పప్పుల సాగుపై దృష్టి సారించాలి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు సంప్రదాయ పంటలే కాకుండా పప్పు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని నస్కల్ రైతు వేదికలో పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భర్ అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలకమైందని, పప్పుధాన్యాల ఉత్పత్తితో ఆత్మనిర్భరులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని సూచించారు. పప్పు ధాన్యాల పంటలకు మార్కెట్ విలువ పెరగాలంటే అన్ని సదుపాయాలతో ముందుకు సాగాలన్నారు. పప్పుధాన్యాల సాగుతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం, ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పూడూరు మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, నాయకులు శ్రీధర్, అశోక్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణతోనే

బీసీ రిజర్వేషన్లు చేపట్టాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్



వికారాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సవరణతోనే బీసీ రిజర్వేషన్లు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండాలంటే రాజ్యాంగబద్ధంగానే అమలు జరుగాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ బిల్లు ఆమోదం కోసం సంపూర్ణంగా సహకరించిన బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు రాజ్యాంగబద్ధంగా వెళ్లాలని ముందు నుంచి ప్రభుత్వాన్ని కోరుతూనే వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ఎన్నిసార్లు కోరినా ఆ విషయాన్ని పెడచెవిన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లదని తెలిసి కూడా ప్రజలను మభ్య పెట్టేందుకు జీవో ద్వారా ముందుకెళ్లిందన్నారు. ఆర్డినెన్స్‌లు, జీవోల ద్వారా వచ్చే రిజర్వేషన్ల వల్ల అనేక న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఇప్పటికి కూడా రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్ల అమలు ప్రయత్నం పక్కన పెట్టి, హైకోర్టు ఇచ్చిన స్టే పై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే మరింత కాలయాపన చేయడం తప్ప దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరపక ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడగా ఎన్నికల విషయంలో ఇంకా జాప్యం జరిగితే గ్రామాలు మరింత నష్టపోవాల్సి ఉంటుందన్నారు.

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీసీసీ అధ్యక్ష నియామకాలకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు మొదలు పెట్టింది. మెజార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా, ఈ నియామకాలు చేపట్టేందుకు ఏఐసీసీ సభ్యులను పరిశీలకులుగా నియమించింది. మూడు జిల్లాల్లో ఆశావహుల సంఖ్య భారీగానే ఉంది. అధ్యక్ష పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నాల్లో తలమునకలయ్యారు. అయితే బరిలో ఉన్న ఆశావహుల నుంచి జిల్లాల వారీగా 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి పార్టీలో ఎక్కువ మంది మద్దతు ఉండే నాయకుడిని డీసీసీ అధ్యక్షుడిగా ప్రకటించనున్నారు.



డీసీసీ అధ్యక్ష పీఠం

ఎవరికో?

కసరత్తు ప్రారంభించిన అధిష్ఠానం



- జిల్లాకో ఏఐసీసీ పరిశీలకుడి నియామకం
- ముగ్గురు చొప్పున పీసీసీ పరిశీలకుల కేటాయింపు
- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మూడు జిల్లాల్లో నేతల పోటాపోటీ

వికారాబాద్/మేడ్చల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డీసీసీ అధ్యక్ష పీఠం ఎంపిక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఏఐసీసీ నుంచి నియమించిన పరిశీలకుల జాబితాలో మార్పులు చేసూ శనివారం కొత్తవారిని నియమించింది. పరిశీలకులతో సమన్వయం చేసుకునేందుకు జిల్లా పరిశీలకులను రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నియమించారు. ఈ ప్రక్రియను శనివారం నుంచే ప్రారంభించాలని పార్టీ ఆదేశించింది. అయితే ఏఐసీసీ పరిశీలకులు ఇంకా చేరుకోకపోవడంతో 13 నుంచి వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో సమావేశాలను నిర్వహించనున్నారు. పీసీసీ కమిటీలతో కలిసి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మూడు నెలల కిందటనే జిల్లాల వారీగా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామకం జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈనెల 4వ తేదీ నుంచి వీరు పర్యటించాల్సి ఉన్నప్పటికీ స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో

మిగతా 7వ పేజీలో...

మూడు జిల్లాలకు ముగ్గురు

మూడు జిల్లాలకు ముగ్గురు ఏఐసీసీ పరిశీలకులను నియమించారు. వికారాబాద్ జిల్లాకు మహారాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు సూరజ్‌ఠాకూర్, రంగారెడ్డి జిల్లాకు కేరళ ఎంపీ రాబర్ట్ బ్రూస్, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాకు కర్ణాటక ఎమ్మెల్యే అంజనీ నింబాల్కర్ నియమితులయ్యారు. ఏఐసీసీ పరిశీలకులతో సమన్వయం చేసుకోవడానికి జిల్లాల వారీగా పీసీసీ పరిశీలకులను అధినాయకత్వం నియమించింది.

టీపీసీసీ పరిశీలకులు వీరే..

పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్.. రంగారెడ్డి జిల్లాకు నలుగురు, మేడ్చల్ జిల్లాకు ముగ్గురు, వికారాబాద్ జిల్లాకు ఇద్దరు పరిశీలకులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లాకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కె. వినయ్ రెడ్డి, కొత్వాల్ అబ్దుల్లా, పి. విజయారెడ్డిలను నియమించారు. మేడ్చల్ జిల్లాకు ఎంపీ పి బలరామ్‌నాయక్, పటేల్ రమేశ్‌రెడ్డి, నందిమల్ల యాదయ్య ముదిరాజ్, సింగాపురం ఇందిర, వికారాబాద్ జిల్లాకు టి బెల్లానాయక్, కోట నీలిమాలను నియమించారు.

18 వరకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలకు కేటాయించిన ఏఐసీసీ పరిశీలకులు, టీపీసీసీ పరిశీలకులు ముందుగా వారం రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. అలాగే 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మొదట జిల్లా స్థాయిలో పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత బ్లాక్‌లు, మండలాల వారీగా పార్టీ ఆయా విభాగాల బాధ్యులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించనున్నారు.

యథావిధిగా ప్రజావాణి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజల అర్జీలు ఇచ్చేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని 13వ తేదీ సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి, సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రావొచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్



మాట్లాడుతున్న వెంకటేశ్వర్

వికారాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టపరమైన హక్కులపై అవగాహన పెంచుకుని సమాజంలో సమానత్వం సాధించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్ సూచించారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఎం.వీ ఫౌండేషన్ వికారాబాద్ ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో లింగ సమానత్వం, బాలికల హక్కులపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన మహిళా - బాలిక హక్కుల గురించి వివరించారు. న్యాయమూర్తి శాంతిలత మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త రాజేంద్రప్రసాద్, వెంకటేశం, శ్రీనివాస్, నర్సింలు, పాల్గొన్నారు.


తాండూరులో భారీ వర్షాలకు పరవళ్లు తొక్కుతున్న కాగ్నా నది (ఫైల్)

వానలే వానలు!

- ఈ ఏడాదిలో తాండూరులో అత్యధికం
- 1,306మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- ఐదు సంవత్సరాల్లో ఇదే రికార్డు
- హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు
- నేటికీ అక్కడక్కడ కురుస్తున్న వర్షాలు

ఐదేళ్ల వివరాలు(మి.మీటర్లలో)

సంవత్సరం	వర్షపాతం
2021	1,000
2022	1,166
2023	941
2024	1,115
2025	1,306

తాండూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా అత్యధిక వర్షాలు కురిసాయి. ప్రధానంగా తాండూరు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ఈ ఏడాదే ఎక్కువ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతానికి మించి వర్షాలు కురువడంతో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. సాధారణ వర్షపాతం 800 మిల్లీమీటర్లుగా ఇప్పటివరకు 1,306 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో యాసంగి సాగుకు సైతం ఇబ్బందులు ఉండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, అతిగా వర్షాలకు పలు చోట్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన

మిగతా 8వ పేజీలో...

భవిష్యత్తులోనూ భారీ వర్షాలు



భవిష్యత్తులోనూ అత్యధికంగా వర్షాలు పడే అవకాశం ఉంది. రైతులు వర్షాలను తట్టుకునే పంటలను సాగుచేసుకోవాలి. పంటల్లో నీటి నిల్వలు లేకుండా నీటిని మళ్లించే విధంగా కాల్వలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఐదేళ్లలో సాధారణ వర్షపాతానికి మించి వర్షం కురిసింది. దీంతో సాగుకు ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉంది.

-సుధాకర్, శాస్త్రవేత్త, తాండూరు

కార్మికులకు కనీస

వేతనం అందించాలి


కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్

మోమిన్‌పేట్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నార్, వోల్టా గ్రీన్, కార్తీకేయ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. శనివారం ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పెరిగిన ధరలకనుగుణంగా యాజమాన్యాలు వేతనాలు అందించాలన్నారు. అదే విధంగా ప్రమాద బీమా రూ.50లక్షలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. ఆయనతోపాటు సీఐటీయూ యూనియన్, రైతు సంఘం నాయకులు మహిపాల్, సుదర్శన్, సతీశ్, అక్బర్, కార్మికులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న

ఇసుక మాఫియా

- అడ్డుకోబోయిన పోలీసులపైకి ట్రాక్టర్ ఎక్కించే యత్నం
- బషీరాబాద్ మండలంలో ఘటన

7

మర్పల్లిలో బాణామతి కలకలం

- ఇటీవల అనారోగ్యంతో ఓ మహిళ మృతి
- చేతబడి చేసిందంటూ ఆ గ్రామానికి చెందిన మరో మహిళపై ఆరోపణలు
- మనస్తాపంతో బావిలో దూకి ఆత్మహత్య
- కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు


దొబ్బల నర్సమ్మ(ఫైల్)

మర్పల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండల కేంద్రంలో చేతబడి కలకలం రేపింది. బాణామతి ఆరోపణలతో మనస్థాపానికి గురైన ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లి మండల కేంద్రానికి చెందిన దొబ్బల నర్సమ్మ(55) గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. వారం రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు నర్సమ్మ చేతబడి చేయడంతోనే ఆమె మృతి చెందిందని ఆరోపించారు. మృతి చెందిన మహిళ కుటుంబ సభ్యులు, మరికొంత మంది నర్సమ్మ ఇంటికి వెళ్లి దూషిస్తూ గొడవపడ్డారు. తీవ్ర మనస్తాపానికి గురైన నర్సమ్మ శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి రాత్రయినా ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. కాగా, శనివారం చెన్నారెడ్డికి చెందిన బావిలో మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం రాగా, పరిశీలించి దొబ్బల నర్సమ్మగా గుర్తించారు. మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విషయం తెలుసుకున్న వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ వెంకట్ సంఘటన స్థలాన్ని పరిశీలించి జరిగిన విషయంపై ఆరా తీశారు. ఆరోపణలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

సాదాబైనామాల

దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ డీఎస్ రజిని

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సాదాబైనామా దరఖాస్తుల్లో తప్పులు లేకుండా పకడ్బందీగా పరిశీలించాలని ఘట్‌కేసర్ తహసీల్దార్ డీఎస్ రజిని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 2020లో దరఖాస్తు చేసుకున్న సాదాబైనామా దరఖాస్తులను ఆమె శనివారం పరిశీలించారు. ఇటీవల హైకోర్టు కోర్టు సాదాబైనామాలపై స్టే కొట్టివేడయంతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేశారు. మండలంలో దరఖాస్తు చేసుకున్న 107మందికి నోటీసులు జారీ చేశారు. సాదాబైనామా పేపర్‌తో పాటు అమ్మిన వారి, కొనుగోలు చేసిన వారి ఆధార్ కార్డులను పరిశీలించి అమ్మిన వారి నుంచి సమ్మతి(కన్సెంట్) పత్రాన్ని తీసుకున్నారు. మండలంలో సాదాబైనామాపై ఎక్కువగా అంకుశాపూర్‌లో 42, అవుశాపూర్‌లో 22, ఎదులాబాద్‌లో 20, కొర్రెములలో 34, ప్రతాప్ సింగారంలో 26 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. మిగతా గ్రామాల నుంచి మరో 30 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం డిసెంబరు 15న లబ్ధిదారులకు పట్టాలు అందజేయాలని యోచిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్, జీపీవోలు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సత్యశీలారెడ్డి

కొత్తూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్సై సత్యశీలారెడ్డి సూచించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎస్సై ఆధ్వర్యంలో స్థానిక పారిశ్రామికవాడ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. పత్రాలను పరిశీలించి, డ్రైవర్లకు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సాయిచరణ్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

అద్దె భవనంలో కులకచర్ల పోస్టాఫీసు

● స్థలం కేటాయించి ఏళ్లు గడిచినా చేపట్టని భవన నిర్మాణం



కులకచర్లలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఉప తపాలా కార్యాలయం

కులకచర్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కులకచర్ల ఉప తపాలా కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించినా నిర్మించక ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. కులకచర్లలో 40ఏళ్ల క్రితం అద్దె భవనంలో సబ్ పోస్టాఫీస్‌ను ప్రారంభించారు. సొంత భవనానికి కోసం టెలిఫోన్ భవన్ పక్కన భూమి కేటాయిం చారు. అయితే నిర్మాణం మాత్రం చేపట్టలేదు. సౌకర్యాలు లేక పాత అద్దె భవనం నుంచి మరో అద్దె భవనంలోకి మార్చారు. ప్రస్తుతం కల్యాణ్‌నగర్‌లోని అద్దె భవనంలో పోస్టాఫీసు కొనసాగుతోంది. తపాలా శాఖ అధికారులు చొరవ చూపి భవన నిర్మాణాన్ని చేపట్టాలని, లేదంటే కేటాయించిన స్థలం కబ్జా పాలయ్యే ఆస్కారం ఉందని గ్రామస్తులు అంటున్నారు.

ఉత్తరాలు, పోస్టుబాక్స్‌ల కనుమరుగు

గతంలో సమాచారాన్ని తెలుసుకునేందుకు తపాల వ్యవస్థ పెద్ద దిక్కుగా ఉండేది. ఉత్తరాలు రాసి పోస్టు బాక్స్‌లో వేస్తే రాసిన అడ్రె స్‌కు తపాలా శాఖ చేరేసేది. ఇలా ప్రజలు వారి కుటుంబీకులు, బంధువుల యోగక్షేమాలు తెలుసుకునే వారు. కానీ నేడు ఉత్తరాలు పోస్టుబాక్సుల్లో వేసే వారే కరువయ్యారు. ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ సాంకేతికత పెరిగిన తర్వాత మాన్యువల్ ఉత్తర ప్రత్యుత్తరాలు చాలా వరకు తగ్గాయి. ఈ-మెయిల్, సెల్‌ఫోన్, వాట్సాప్ ఇతర మాధ్యమాలు వచ్చిన తర్వాత ప్రజలు ఉత్తరాలపై ఆసక్తి చూపడం లేదు. పోస్టు బాక్సులు మాత్రం గ్రామాల్లో చెట్లకు వేలాడుతున్నాయి.


పోస్టాఫీస్ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలం


చెట్టుకు కట్టిన పోస్ట్‌బాక్స్


రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారగొండ వెంకటేశ్, టి-శాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డిలతో నాయకులు

విద్యకు ప్రభుత్వం పెద్ద పీట

తలకొండపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతోందని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారగొండ వెంకటేశ్, టి-శాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డిలు అన్నారు. మరే రాష్ట్రంలో లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. తలకొండపల్లి మండలం వెల్జాల నాయకులు శనివారం వెంకటేశ్, వేణుగోపాల్ రెడ్డిలను హైదరాబాద్‌లో కలిశారు. వెల్జాల జిల్లా పరిషత్ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. విద్యార్థుల కాస్మొటిక్, మెస్‌చార్జీలు పెంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసమూర్తి, వెంకట్‌రెడ్డి, అంబాజీ, అంజయ్యగౌడ్, అజీజ్, నర్సింహ్మలు, అశోక్‌బాబు, కిరణ్‌గౌడ్, కృష్ణగౌడ్, ఆరిఫ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు..

● ప్రమాదపు అంచున విద్యుత్ స్తంభాలు


చుట్టూ తవ్వకాలు జరపడంతో ప్రమాదకరంగా మారిన కరెంటు స్తంభం

పెద్దేముల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలం తట్టెపల్లి, పాషాపూర్ శివారు భూముల్లో ఎర్రమట్టి(లాటరేట్)తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. తట్టెపల్లి సమీపంలోని అంబురామేశ్వర ఆలయానికి వెళ్తే విద్యుత్‌లైన్ స్తంభాలు కొన్ని చోట్ల ప్రమాదపు అంచుకు చేరుకున్నాయి. అప్పటి జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఆలయానికి విద్యుత్ లైన్ వేయించారు. ప్రస్తుతం ఆ స్తంభాల పక్కన మట్టి తోడేయడంతో కూలేలా ఉన్నాయి. ఎర్రమట్టి వ్యాపారులు స్తంభాల చుట్టూ కొంత వదిలేసి చుట్టూ తవ్వేస్తున్నారు. స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఏర్పడింది. అధికారులు వాటిని చూసీ చూడనట్లు వదిలేస్తుండడంతో అంబురామేశ్వర ఆలయానికి వెళ్లే విద్యుత్ లైన్ పూర్తిగా దెబ్బతినే అవకాశం కనిపిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి స్తంభాలు ఉన్నచోట తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి


కడ్తాలలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడ్తాల్/తలకొండపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ శనివారం కడ్తాలలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు అబ్బు రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ హాజరయ్యారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. సీజేఐ గవాయ్‌పై దాడికి పాల్పడ్డ న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కృష్ణ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న కలెక్టరేట్ ముట్టడి, 17న కడ్తాల మండల పరిషత్ కార్యాలయం ముట్టడి, 22న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, నాయకులు శ్రీకాంత్, లక్ష్మయ్య, నర్సింహ, పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తుడుం శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి శ్రీకాంత్, పోతుగంటి కృష్ణ, కిరణ్, జ్యోతయ్య, మల్లేశ్, రాజు, నారాయణ, సంజీవ, శరత్‌చంద్ర, అనిల్, సురేశ్, జంగయ్య, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రయాణికులకు ఎన్నాళ్లీ అవస్థలు?

● షెల్టర్ లేక ఎండ, వానల్లో బస్సుల కోసం నిరీక్షణ



బషీరాబాద్ రైల్వే స్టేషన్ కూడలి వద్ద నిలిపిన ఆర్టీసీ బస్సు

బషీరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లో బస్టాండ్ నిర్మించినా ఎవరికీ ఉపయోగపడటం లేదు. ప్రయాణికులకు అనువుగా లేని చోట నిర్మచడంతో 25ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. ప్రయాణికులు రైల్వేస్టేషన్ కూడలిలో చింతచెట్టు, హోటళ్ల వద్ద నిలబడి బస్సుల్లో రకపోకలు సాగిస్తున్నారు.ఈ ప్రాంతం ప్రైవేటు వాహనాలతో ఎప్పుడూ కిక్కిరిస్తూ ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇరుకైన రోడ్డు, ఆపై చిరు వ్యాపారుల తోపుడు బండ్లు, అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో బస్సులను నడీ రోడ్డుపై నిలుపుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో బస్ షెల్టరు నిర్మిస్తే బాగుంటుదని పలువురు కోరుతున్నారు.

రిజర్వేషన్లు ఇవ్వకపోతే రాష్ట్రం అగ్నిగుండమే

● బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్


విలేకరులతో మాట్లాడుతున్న కొమ్ము శ్రీనివాస్‌యాదవ్

ఆమనగల్లు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాంగ బద్ధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వకపోతే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో తప్పేంటి అని ప్రశ్నించారు. ఆమనగల్లులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్యారంటీల అమలు తరహాలోనే రిజర్వేషన్ల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఆది నుంచీ బీసీలకు అన్యాయం చేస్తూనే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి 42శాతం రిజర్వేషన్‌ల విషయంలో చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై వత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో ఆమోదింపజేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాక స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధిపత్య వర్గాలకు కొమ్ము కాస్తోందని విమర్శించారు. రాజ్యాధికార సాధనే ధ్యేయంగా బీసీలు ఏకతాటిపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కొండల్‌యాదవ్, మల్లేశ్, మహేశ్, శ్రీనివాస్, గణేశ్, సైదులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

శంకర్‌పల్లి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం కొండాకల్‌లోని కిరాణ దుకాణంలో 23 మద్యం బాటిళ్లు, మోకిలలోని దాబాలో 5బాటిళ్లు దొరికాయని ఆయన తెలిపారు. కిరాణ దుకాణ యజమాని నర్సింహారెడ్డితో పాటు దాబా యజమాని ముక్తార్‌పై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పెరుగుతున్న డ్రోన్‌ల వినియోగం

● రైతులకు సహాయకారిగా సాంకేతికత

దౌల్తాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పంటలకు ఎరువుల పిచికారీలో రైతులకు డ్రోన్‌లు అండగా నిలుస్తున్నాయి. అన్నీ తానై, అన్నింటా తోడై అన్నట్లుగా డ్రోన్లు ప్రతీ పనిని సులభంగా చేసి పెడుతున్నాయి. అసాధ్యం అనుకున్న పనులను సుసాధ్యం చేస్తున్నాయి. ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతున్నాయి. డ్రోన్ల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పంటల పర్యవేక్షణ, ఎరువులు, పురుగు మందుల పిచికారీ లాంటి పనులను తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో చేసి పెడుతున్నాయి. కూలీల కొరతకు పరిష్కారం చూపుతున్నాయి. అదే విధంగా ఫొటోగ్రఫీ, నిఘా, సరుకు రవాణా, మైనింగ్ నిర్మాణం రంగం, జియో మ్యాపింగ్, రక్షణ, మౌలిక సదుపాయాల తనిఖీ లాంటి వివిధ రంగాల్లో డ్రోన్‌ల వాడకం పెరిగిపోయింది. ప్రభుత్వం కూడా డ్రోన్ టెక్నాలజీని ప్రోత్సహిస్తోంది.

పెళ్లిళ్లు, రాజకీయ పార్టీల సభలు

సినిమా సన్నివేశాలు, పెళ్లిలు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాల చిత్రీకరణకు డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. చూపరులకు ఇవి విజువల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తున్నాయి. ప్రీ వెడ్డింగ్ షూట్‌లు, బర్త్‌డే పార్టీలకు వీటిని ఉపయోగించడం సాధరణమైపోయింది. ఒకప్పుడు నేలపై, పెద్ద పెద్ద స్టాండ్‌లపై దృశ్యాలను కెమెరాలో బంధించేవారు. అందులో అనేక ప్రమాదాలు జరిగేవి. డ్రోన్ కెమెరా వచ్చాక ఈ సమస్యకు పరిష్కారం లభించింది. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ విభాగాల్లో డ్రోన్‌లు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. డ్రోన్‌లకు కృత్రిమ మేధ తోడైతే మన కళ్ల ముందు మరెన్నో అద్భుతాలను వీక్షించే అవకాశం లేకపోలేదు.


నందారంలో వరి పొలంలో డ్రోన్‌తో మందులు పిచికారీ చేస్తున్న రైతు రాజశేఖర్‌రెడ్డి

డ్రోన్‌తో వ్యవసాయం ...

పంట పొలాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీకి ఎవరు ముందుకు రావడం లేదు. దీంతో రైతులు డ్రోన్ టెక్నాలజీని ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రోన్‌లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పని భారంతో పాటు సమయం, ఖర్చు రెండు కలిసివస్తున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతున్నారు.

ఆపదలో అండగా ...


అడవుల్లో అగ్ని ప్రమాదాలు, నదుల్లో ప్రమాద పరిస్థితులను పర్యవేక్షణకు, ఎత్తైన భవనాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు, వారికి ఆహార పదార్థాలు, మందులు అందించేందుకు డ్రోన్లు దోహదపడతున్నాయి. అభివృద్ధి పనుల పర్యవేక్షణతో పాటు మారుమూల ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహారం అందించేందుకు సైతం డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. ఆపద సమయంలో సుదూర గ్రామీణ ప్రాంతాలకు వ్యాక్సీన్, మందులను వీటి ద్వారా సరఫరా చేస్తున్నారు. వర్షా ప్రభావం వల్ల పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఇలా ఎన్నో విధాలుగా డ్రోన్‌లు దోహదపడుతున్నాయి. ప్రస్తుతం మనిషి జీవితంలో డ్రోన్‌లు ఓ భాగమైపోయాయంటే అతిశయోక్తి కాదు. డ్రోన్‌ల అవసరాన్ని బట్టి రెక్కలు, సామర్థ్యం, రేంజ్, పవర్ స్పేర్స్ పరికరాలు ఒక్కో సైజులో ఉంటాయి. అరచేతిలో పట్టేంత 50 సెంటీ మీటర్ల నుంచి 2మీటర్ల మధ్య ఉండే చిన్న డ్రోన్‌లకు రెక్కలు ఫిక్స్‌డ్‌గా ఉంటాయి. వీటిని ఫొటోగ్రఫీకి ఉపయోగిస్తారు. 2మీటర్ల కంటే ఎక్కువ సైజు డ్రోన్‌లను పారిశ్రామిక అవసరాలకు, వ్యవసాయ రంగాల్లో మందుల పిచికారీకి ఉపయోగిస్తారు. వీటి ధర రూ.20 వేల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుంది.


పంటపై రసాయనాలు పిచికారీ చేస్తున్న డ్రోన్











వికారాబాద్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

వికారాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచాలన్(కవాతు)ను ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా వికారాబాద్‌లో భారీ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్తగంజ్ నుంచి ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సద్భావన సహ ప్రముఖ్ రామకృష్ణ మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకై ఆర్‌ఎస్‌ఎస్ పాటుపడుతుందన్నారు. ధర్మ పరిరక్షణకై ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. మన దేశానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు. ప్రపంచానికే దిశానిర్దేశం చేసిన ఘనత భరత భూమిదన్నారు. హిందూ సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని, రానున్న రోజుల్లో ఈ దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలవబోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ్ చాలక్ సత్యనారాయణ గౌడ్, సహ సంఘ్ చాలక్ గోవర్ధన్‌రెడ్డి, ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కూర జయదేవ్, సంఘ పెద్దలు, పట్టణ ప్రముఖులు, స్వయం సేవకులు పాల్గొన్నారు.

హర్యానా డీజీపీపై చర్యలు తీసుకోవాలి



పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పరిగి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రంలో ఐపీఎస్ పూరన్‌కుమార్‌పై కుల వివక్షతో వేధించి ఆయన ఆత్మహత్యకు కారణమైన డీజీపీని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్‌లు మాట్లాడుతూ.. పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన డీజీపీ శత్రుజిత్‌సింగ్, ఇతర ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వెంకట్, సత్తయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ మాదిగ

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడియత్నానికి నిరసనగా ఈ నెల 13న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపబోతున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ తెలిపారు. శనివారం నిర్వహించిన ఫరూఖ్‌నగర్ మండల ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశానికి నర్సింహ హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలను పెట్టుకుని నిరసనను తెలుపుతామన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించిన అడ్వకేట్ రాకేష్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నర్సింహ కోరారు. సమావేశంలో జోగు నాగభూషణ్ మాదిగ, విఠ్యాల యాదగిరి మాదిగ, ఎన్.మహేందర్, జోగు నరేష్, డి.బన్నీ, హరీష్, సురేష్ పాల్గొన్నారు.

ఆస్తి కోసం బాబాయిపై కత్తితో దాడి



గాయపడిన శ్యామ్



నిందితుడు ప్రసాద్

మొయినాబాద్ 11 అక్టోబరు(ఆంధ్రజ్యోతి): ఆస్తికోసం సొంత బాబాయిని అంతమొందించేందుకు కత్తితో దాడి చేశాడు ఓ ప్రబుద్ధుడు. చనిపోయాడని భావించి అదే కత్తితో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి సురంగల్‌లో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సురంగల్‌కు చెందిన రామగళ్ల ఎల్లయ్యకు సర్వే నంబర్ 42లో 250 గజాల స్థలం ఉంది. అతడికి ముగ్గురు కొడుకులు. పెద్ద కొడుకు నందం ఈ స్థలం తనొక్కడికే కావాలని పట్టుబట్టాడు. ఈ విషయమై గ్రామపెద్దల పంచాయితీలో ముగ్గురికి సమానంగా ఉంటుందని చెప్పారు. అయితే నందం కొడుకు ప్రసాద్ శనివారం ఆ స్థలానికి ప్రీ కాస్ట్ వాల్ నిర్మాణం చెపట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఎల్లయ్య రెండో కుమారుడు.. ప్రసాద్ బాబాయి శ్యామ్ వెళ్లి పనులు ఆపేందుకు యత్నించాడు. దీంతో ప్రసాద్ పథకం ప్రకారం శ్యామ్‌పై కత్తితో దాడి చేశాడు. అతడు పరిగెడుతున్నా వెంబడించి కత్తితో పొడిచాడు. మెడ, ఛాతీ భాగాల్లో పొడిచాడు. కుడిచేయి నరికేశాడు. తీవ్ర గాయాలైన శ్యామ్ రక్తస్రావంతో పడిపోయాడు. శ్యామ్ చనిపోయాడని ప్రసాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. శ్యామ్ భార్య, కుటుంబ సభ్యులు అతడిని నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్యామ్ పరిస్థితి విషమంగా ఉంది. శ్యామ్ భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నిగ్రామాల్లో మౌలిక వసతుల కల్పన



ఎంపీ రవికి వినతిపత్రం ఇస్తున్న వెల్జాల కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలు, తండాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ పట్టణాలకు దీటుగా వసతులు కల్పిస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ అమలుచేస్తుందని పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల కాంగ్రెస్ నాయకులు శనివారం ఎంపీ రవిని హైదరాబాద్‌లో కలిశారు. మార్కెట్ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి, వేద్రాద్రి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ధర్మకర్త, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తిలతో కలిసి స్థానిక నాయకులు వెల్జాల, మాదాయిపల్లి గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి పత్రం ఇచ్చారు. పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు, నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, అంజయ్యగౌడ్, అంబాజీ, నర్సింహులు, అజీజ్, అశోక్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- అడ్డుకున్న పోలీసులపైకి ట్రాక్టర్ ఎక్కించే యత్నం
- బషీరాబాద్ మండలం దామర్‌చెడ్‌లో ఘటన
- పోలీసు శాఖ సీరియస్.. నిందితులపై కేసు




బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిలిపిన ఇసుక ట్రాక్టర్

బషీరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. రాత్రయితే చాలు వాగులు, వంకల్లో వాలిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన పోలీసులపైకి ట్రాక్టర్లను తీసుకెళ్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాజాగా బషీరాబాద్ మండలందామర్‌చెడ్‌లోని నంద్యానాయక్ తండా వద్ద శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డుకోబోయిన పెట్రోలింగ్ పోలీసుల మీదికి డ్రైవర్ ట్రాక్టరును తీసుకెళ్లేందుకు యత్నించిన ఘటనపై పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఎక్మాయి శివారు వాగులోంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో పోలీసులు నంద్యానాయక్ తండా వద్ద వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించగా డ్రైవర్ దురుసుగా ప్రవర్తించాడు. ట్రాక్టర్‌ను పోలీసుల మీదికి తీసుకెళ్లే యత్నం చేయగా అప్రమత్తమైన పోలీసులు పక్కకు తప్పించుకున్నారు. అంతలోనే డ్రైవర్ ట్రాక్టర్‌ను ఆపేసి అక్కడి నుంచి పోలీసులకు దొరకకుండా పారిపోయాడు. అదే రాత్రి అక్కడికి చేరుకున్న ట్రాక్టర్ యజమాని పోలీసులతో గొడవకు దిగగా అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు విచారణలో డ్రైవర్ పేరు చవాన్ బాలకృష్ణగా తేలింది. ట్రాక్టర్ ఓనర్ జమ్లానాయక్‌తండాకు చెందిన చవాన్ శ్రీనుగా గుర్తించారు. ట్రాక్టరును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నుమాన్‌అలీ తెలిపారు.

డీసీసీ అధ్యక్ష పీఠం ఎవరికో?

(ఐదో పేజీ తరువాయి)



వాయిదా వేసింది. స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడంతో కాంగ్రెస్ నాయకత్వం మళ్లీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది.

రంగారెడ్డి జిల్లా అధ్యక్ష బరిలో....

ప్రస్తుతం రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా చల్లా నర్సింహారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన 8 ఏళ్ల నుంచి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఆయనను టీయూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా నియమించింది. దీంతో ఆయన ఇప్పుడు రెండు పదవుల్లో కొనసాగుతున్నారు. కాగా, నూతన అధ్యక్ష పీఠం కోసం అనేక మంది నేతలు పోటీపడుతున్నారు. నగర శివార్ల నుంచి అంగ, అర్థ బలం ఉన్నవారు ఎక్కువ మంది ఈ పదవిని ఆశిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, దీపా భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సతీశ్, భీం భరత్, సిద్దేశ్వర్, ఐలా శ్రీనివాస్‌గౌడ్, బట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తదితర లు పోటీపడుతున్నారు. అయితే ఎమ్మెల్యేలు తమ ప్రాంతం వారికి ఈ పదవి దక్కకుండా జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేరు కూడా ప్రచారంలో ఉన్నప్పటికీ ఆయన ఆసక్తి చూపడం లేదని తెలిసింది.

వికారాబాద్ జిల్లా నుంచి..

ప్రస్తుతం వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. కాగా, నూతన అధ్యక్ష పీఠం కోసం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, హెచ్‌డీసీసీబీ డైరెక్టర్ నేనావత్ కిషన్‌నాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు లాల్‌కృష్ణ ప్రసాద్ తదితరులు రేస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే మరో సీనియర్ నేత మహిపాల్‌రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. పార్టీ పెద్దలు కొందరు ఆయన్ని అడిగినట్లు సమాచారం. కానీ ఆయన పదవిపై అనాసక్తి చూపినట్లు తెలుస్తోంది.

మేడ్చల్‌లో పోటాపోటీ..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి 21 నెలలుగా ఈ పదవిలో కొనసాగుతున్నాడు. మళ్లీ తననే డీసీసీ పదవిలో కొనసాగిస్తారనే ఆశాభావంతో ఉన్నారు. కాగా, ఈ పదవికి జిల్లా నుంచి పెద్ద సం ఖ్యలో నేతలు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్ రేసులో ఉన్నారు. అయితే, మూడు నెలల క్రితమే డీసీసీ అధ్యక్షుడిగా శ్రీశైలంగౌడ్ పేరు ఖరారైందనే ప్రచారం జరిగింది. జిల్లా అధ్యక్ష పదవి ఈసారి బీసీలకే ఇవ్వాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. డీసీసీ ఎంపికలో భాగంగా మేడ్చల్ జిల్లా కార్యాలయంలో నేడు ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

పార్టీ శ్రేణుల మద్దతే కీలకం

డీసీసీ అధ్యక్ష పదవి కోసం బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరికి ఎంత మేర పార్టీ శ్రేణుల మద్దతు ఉందనేది ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు చర్చించి నివేదిక తయారు చేస్తారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు నివేదికలు అందజేసి పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను వివరించనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత సీఎం, శాసనసభ స్పీకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో చర్చించి అధ్యక్షుడి నియామకంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇదిలా ఉంటే, డీసీసీ అధ్యక్ష నియామకాల్లో సామాజిక వర్గాల వారీగా న్యాయం జరిగేలా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్, మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

తాండూరు పోలీసుల పని తీరుపై అసంతృప్తి

- నెలల పాటు చోరీ కేసులను ఛేదించని అధికారులు
- సివిల్ వ్యవహారాల్లో తలదూర్చడంపై ఉన్నతాధికారుల సీరియస్
- ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫిర్యాదు
- కొందరికి బదిలీ తప్పదని చర్చ



తాండూరులో జరిగిన ఓ చోరీ కేసులో విచారణ చేస్తున్న పోలీసు అధికారులు(ఫైల్)

తాండూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తాండూరు డివిజన్‌లో పోలీసు అధికారుల తీరుపై అటు ఆ శాఖ ఉన్నతాధికారులు, ఇటు అధికార పార్టీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. డివిజన్ పరిధి పోలీస్ అధికారులను బదిలీపై పంపేందుకు రంగం సిద్ధమైంది. ఇటీవల క్రైమ్ రేట్ పెరగడం, చోరీకేసుల్లో నెలలు గడుస్తున్నా చిన్న క్లూ కూడా రాబట్టకపోవడంపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ వ్యాపారాలను అరికట్టడంలో విఫలమయ్యారనే విమర్శలొస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ దాడులు చేసే వరకు స్థానిక పోలీసులకు సమాచారం తెలియడం లేదు.ఇటీవల భారీ ఎత్తున నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టును టాస్క్‌ఫోర్స్ స్వాధీనం చేసుకుంది. పోలీసులు సివిల్ వ్యవహారాల్లో తలదూర్చుతున్నారు. ఓ పోలీస్ అధికారిపై చర్యలు చేపట్టాలని ఇటీవల సీపీఎం నాయకులు ధర్నాలు చేశారు. సదరు అధికారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. న్యాయపరమైన కేసులపై పోలీసులకు తెలియజేస్తున్నా పోలీసులు తమ మాట వినడం లేదని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే సైతం పోలీసుల వ్యవహారంపై అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల సంగెం కలాన్, చంద్రవంచ గ్రామాల్లో ఘర్షణలతో శాంతిభద్రతల సమస్య ఏర్పడడంపై చర్చ జరిగింది.

ఎక్కడి కేసులు అక్కడే..!

తాండూరు డివిజన్‌లో 9నెలల క్రితం జరిగిన మూడు భారీ చోరీ కేసుల్లో పోలీసులు ఒక్కటీ ఛేదించలేదు. అధునాతన పరిజ్ఞానం, అనుభవం ఉన్న క్రైమ్ టీం ఉన్నా కేసులను పరిష్కరించడం లేదు. క్రైమ్ టీంలను తరచూ మార్చడం, వారికి ఇతర బాధ్యతలను అప్పగించడంతోనూ కేసుల ఛేదనలో పురోగతి లేదు. తాండూరు బృందావన్ కాలనీలో ఫిబ్రవరిలో బస్వరాజ్ అనే వ్యక్తి ఇంట్లో పట్టపగలు 18 తులాల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల డబ్బు చోరీ జరిగింది. అంతర్రాష్ట్ర దొంగను గుర్తించినా ఇప్పటి వరకు పట్టుకోలేదు. అలాగే సాయిపూర్‌లోని వెంకట్‌రెడ్డి ఇంట్లో 40తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకపోయారు. ఈ కేసులో ఆధారాలు లభించాయని, దొంగలను పట్టుకుంటామని పోలీసు అధికారులు చెప్పినా కేసు ఛేదించలేదు. పెద్దేముల్ మండలం కందనెల్లిలో జూన్ 12న జంగం ప్రభులింగం ఇంట్లో 7 తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు చోరీ చేశారు. ఈ కేసునూ ఇంత వరకు ఛేదించలేకపోయారు. నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ సంఘటనలు, చోరీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి డీఎస్పీ, సీఐలకు ఫోన్లు చేశారు.

బదిలీకి రంగం సిద్ధం?

డివిజన్ పోలీసు అధికారుల పనితీరుపై అసంతృప్తితో ఉన్న ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే .. వారిని బదిలీ చేయించేందుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఒకరిద్దరు కొత్త ఎస్ఐలు కూడా ప్రజలతో సన్నిహిత సంబంధాలు అలవర్చుకోవడం లేదని, నాయకులతోనూ దురుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులొచ్చాయి. ఇదిలా ఉంటే తాండూరు డీఎస్పీగా కరుణసాగర్‌రెడ్డిని లేదా శ్రీనివాస్‌ను, కరన్‌కోట్ ఎస్ఐగా విద్యాచరణ్‌రెడ్డిని, పెద్దేముల్‌కు శంకర్, బషీరాబాద్ ఎస్ఐగా ప్రశాంత్‌వర్ధన్‌ను తీసుకొచ్చే అవకాశాలున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న తాండూరు టౌన్ సీఐ సంతోష్‌కుమార్ బదిలీకి ఆస్కారం ఉంది.

మల్లికార్జునాలయంలో ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

దుద్యాల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): హకీంపేట్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం నిర్మించి ఐదేళ్లు పూర్తయింది. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఆలయంలో పూజలు చేశారు. రెండు రోజుల పాటు కొనసాగే కార్యక్రమాల్లో ప్రతిష్ఠాపన కోసం తీసుకొచ్చిన దేవుళ్ల విగ్రహాలను శుక్రవారం రాత్రి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.శనివారం ఆలయంలో గణపతి గౌరీ పూజ, గోపూజ, అఖండ దీపారాధన, పుణ్యాహఃవచనం, యాగశాల ప్రవేశం, ధ్వజస్తంభం, నవగ్రహ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. గజ్జెల నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేడు(ఆదివారం)నవగ్రహాలు, ధ్వజస్తంభం, వీరభద్రేశ్వరస్వామి, రేణుకాచార్య మాతల విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు.

విజ్ఞాన్ కళాశాలలో వైద్యశిబిరం



ఘట్‌కేసర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ముందస్తు వైద్య పరీక్షలతో రుగ్మతలను ముందే పసిగట్టే అవకాశం ఉంటుందని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నికల్ టైన్స్(మహిళా కళాశాల) ప్రిన్సిపాల్ అప్పారావునాయుడు అన్నారు. కళాశాల సిబ్బందికి, డ్రైవర్లకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీలత సమక్షంలో మహదీపట్నంలోని లీనస్ డయాగ్నస్టిక్స్ సెంటర్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. 200మందికి బీపీ, షుగర్, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరు క్రమం తప్పక వైద్యపరీక్షలు చేయించుకోవాలని అప్పారావు సూచించారు. అబ్దుల్ కఫూర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలతో ప్రజలకు చేరువైన కాంగ్రెస్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, హామీల అమలుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాలు, పథకాలతో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం పాపర్లబోడు తండా బీజేపీ నాయకులు రాజు, కుమార్, గోపి తమ అనుచరులతో శనివారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ వైస్ ఎంపీపీలు అనంతరెడ్డి, నిట్ట నారాయణ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లు కాంగ్రెస్ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆత్మగౌరవం పెంపు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతోందని చెప్పారు. స్థానిక ఎన్నికల అనంతరం విపక్షాల కనుమరుగు తప్పదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. కల్వకుర్తి నియోజకవర్గం సీఎం సహకారంతో వేగవంతంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. రూ.వెయ్యి కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు నారాయణరెడ్డి వివరించారు. బీజేపియేతర పాలిత రాష్ట్రాలపై బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, పార్టీ జిల్లా, మండల నాయకులు అంజన్‌రెడ్డి, బల్‌రామ్, భగవాన్‌రెడ్డి, జగ్‌రామ్, కృష్ణారెడ్డి, కిషన్, లక్ష్మణ్, శేఖర్‌గౌడ్, జంగయ్య, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



గాంధీ భవన్‌లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబాబాద్ డీసీసీ పర్యవేక్షకుడిగా వీర్లపల్లి

షాద్‌నగర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడి నియామక పర్యవేక్షకుడిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పీసీసీ నియమించింది. శనివారం పీసీసీ అధ్యక్షుడు నియామకం పత్రాన్ని అందజేశారు. మహబూబాబాద్, జనగాం కొత్త డీసీసీ అధ్యక్షుల నియామకానికి ఎమ్మెల్యే శంకర్‌తో పాటు, ఒడిశాకు చెందిన మాజీ ఎమ్మెల్యే దుబానీ పట్నానాయక్, శ్రీకాంత్ అమేజ్ నియమితులయ్యారు. వీరంతా డీసీసీ అధ్యక్షుల నియామకానికి ఆ జిల్లా నాయకులతో చర్చించి పేర్లను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందజేస్తారు. ఆదివారం నుంచి కార్యచరణ మొదలుపెట్టనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి వెల్లడించారు.

బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్న సీఈసీ

- ఓటు చోరీకి వ్యతిరేకంగా ఐదు కోట్ల మంది సంతకాల సేకరణ
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



కడ్తాల్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో అధికారం, ఆధిపత్యం కోసం బీజేపీ సాగిస్తున్న ఓటు చోరీకి అడ్డుకట్ట వేయకపోతే ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదమని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ ఏఐసీసీ ఇన్‌చార్జి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రజలంతా గళం విప్పి కాంగ్రెస్ రాహుల్‌గాంధీ సాగిస్తున్న పోరాటంలో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కడ్తాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని, ఓటు విలువను కాపాడతామని, ఓట్ల చోరీని అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకొని బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతూ అధికారంలో కొనసాగుతోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధ విభాగంగా పనిచేస్తుందని ఆరోపించారు. ఇండియా కూటమి రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తుందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఈ నెల 15 వరకు ఐదు కోట్ల మంది నుంచి సంతకాలు సేకరించి కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అనుకూల, బీజేపీ వ్యతిరేక ఓటర్లను గుర్తించి ఓటర్ల జాబితాల నుంచి పథకం ప్రకారం తొలగిస్తున్నారని వంశీచంద్‌రెడ్డి మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా ఈ నెల చివరి వరకు డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా అన్ని బ్లాక్ స్థాయిల్లో పరిశీలకులు పార్టీ శ్రేణుల అభిప్రాయ సేకరణ చేపడుతామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే అబ్జర్వర్లు అభిప్రాయ సేకరణకు చేస్తున్నట్లు తెలిపారు. డీసీసీల నియామకంలో యువత, బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్య, పార్టీ జిల్లా, మండల నాయకులు చేగురి వెంకటేశ్, రాములు, మహేశ్, అంజయ్య, లక్ష్మయ్య, మల్లేశ్, జహంగీర్ అలీ, సత్యం, లక్పతినాయక్, యాదగిరిరెడ్డి, రాఘవేందర్, షాబుద్దీన్, ఇమ్రాన్‌బాబ, రాజేందర్‌గౌడ్, రాజేశ్,ఫరీద్, బాల్‌రాజ్, రామకృష్ణ, మల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

జుంటుపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, అక్టోబర్ 11, (ఆంధ్రజ్యోతి) : యాలాల మండల పరిధిలోని జుంటుపల్లి సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట యాలాల సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగెం ఖుర్దు హన్మంతు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, అక్బర్ బాబా, చెన్నారం అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమయ్య, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జుంటుపల్లి గ్రామానికి చెందిన ఆశప్ప ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

మందుల పిచికారీ వేళ జాగ్రత్త!

- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం
- క్రిమి సంహారక మందుల వినియోగంపై వ్యవసాయాధికారుల సూచనలు

కొడంగల్ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో వరి, కంది, పత్తి పంటలను ఆశించే తెగుళ్లు, చీడపీడల నివారణలో రైతన్నలు బిజీగా ఉన్నారు. ఇదే సమయంలో పంట పొలాలకు యథేచ్ఛగా క్రిమి సంహారక మందులను పిచికారీ చేసే సమయంలో భద్రతా చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రమాదంతో పాటు ప్రాణహాని సంభవించే అవకాశాలు కూడా ఉంటాయని మండల వ్యవసాయధికారిణి జి.తులసి రైతులకు సూచించారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలపై అక్కడక్కడ చీడపీడలు వచ్చే అవకాశం ఉంది. కందిపంటలో పూత కాపు దశలో ఉండడంతో చీడపీడలు అధికంగా వస్తాయి. పత్తిలో సైతం కాయలకు కాయతొలుచు పురుగులు వస్తాయి. వీటి నివారణకు పురుగుల మందులను పిచికారీ చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు వహించాలి. దీనిపై రైతువేదికల్లో అవగాహన కల్పిస్తున్నాం. గోడపత్రికలను అతికించాం.

- జి.తులసి, వ్యవసాయ అధికారి, కొడంగల్



పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పురుగుల మందు పిచికారీకి పరిశుభ్రమైన నీరు వినియోగించాలి. పిచికారీ చేసే ముందు నోరు, ముక్కు, కళ్లకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి. తలకు టోపీ ధరించి, ముఖానికి కచ్చితంగా మాస్కు పెట్టుకోవాలి. పురుగుల మందులతో వచ్చిన డబ్బాలను, సంచులను ఇతర అవసరాలకు ఎట్టి పరిస్థితిలోనూ ఉపయోగించొద్దు. డబ్బాపై ఉన్న లేబుళ్లలో చూపిన విధంగా మందులను కలుపుకోవాలి. పురుగుల మందులను కలిపినా, పిచికారీ చేసినా కళ్లజోడును ధరించాలి. లేదంటే వాటి తుంపర్లు కళ్లలోకి వెళ్లే ప్రమాదముంది. పురుగుల మందు ద్రావణాన్ని స్ప్రేయర్లలో పోసే ముందు, పొలాల్లో పిచికారి చేసే ముందు బీడి, చుట్ట, సిగరెట్, ఖైనీ, గుట్కా, పాన్ మసాలా వంటివి వినియోగించకూడదు. పురుగు మందుల డబ్బాను వాసన చూడకూడదు. భోజనానికి ముందు సబ్బుతో కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పంటలపై పిచికారీ చేసే సమయంలో స్ప్రేయర్ నాజల్ సక్రమంగా ఉందో లేదో చూసుకోవాలి. గాలి, ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో మందు ద్రావణాన్ని పిచికారీ చేయరాదు. గాలికి వ్యతిరేక దిశలో కాకుండా వాలుగా ఉన్నప్పుడు ద్రావణాన్ని పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

క్రైం కార్నర్

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



ఆంజనేయులు(ఫైల్)

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలోని చటాన్‌పల్లి లింగారెడ్డిగూడ మధ్యలో శనివారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. షాద్‌నగర్‌పటేల్ రోడ్డుకు చెందిన ఆంజనేయులు(35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చిన్నప్పుడే అతడి తల్లిదండ్రులు చనిపోగా వివాహం జరిగిన కొన్నిరోజులకే భార్య అతడిని విడిచిపెట్టి వెళ్లిపోయింది. బాగోగులు చూసుకోవడానికి ఎవరూ లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. స్టేషన్ మాస్టర్ అబిదేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత



మృత్యువాత పడిన ఎద్దును చూసి రోదిస్తున్న రైతు

పూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కాడెద్దు మృత్యువాతపడింది. ఈ ఘటన పూడూరు మండలం కేరవెళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన యువరైతు ఫయాజ్‌కు చెందిన కాడెద్దును అటవీ ప్రాంతంలో మేతకు తీసుకెళ్లగా ఎల్టీలైన్‌విద్యుత్ వైర్ కిందకు వేలాడుతుండటంతో ఎద్దుకు తగిలింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృత్యువాతపడింది. వ్యవసాయ పనులు చేసే ఎద్దు మృతి చెందడంతో యువరైతు ఫయాజ్ కన్నీటిపర్యంతమయ్యారు. ఎద్దు విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వ తనను ఆదుకోవాలని కోరాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

యాలాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా శుక్రవారం రాత్రి అగ్గనూరుకు చెందిన ఓ ఇసుక ట్రాక్టర్ ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని యాలాల పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

జీఎస్టీ బిల్లు లేకుండా స్టీల్‌ను తరలిస్తున్న డీసీఎం స్వాధీనం



స్టీల్‌తో స్వాధీనం చేసుకున్న డీసీఎం వాహనం

పరిగి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ బిల్లు లేకుండా స్టీల్‌ను తరలిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. పరిగి శివారులోని ఓ కంపెనీ నుంచి డీసీఎంలో స్టీల్‌ను జీరో కింద తరలిస్తుండగా జీఎస్టీ అధికారులు శనివారం పట్టుకున్నారు. స్టీల్‌తో ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిత్యం జీఎస్టీ లేకుండా స్టీల్‌ను లారీల్లో తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పరిగిలోనూ వ్యాపారులు జీఎస్టీల లేకుండా స్టీల్ అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రిజర్వేషన్లు మారేనా?



కులకచర్ల ఎంపీడీవో కార్యాలయం

కులకచర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జడ్పీటీసీ, 12 ఎంపీటీసీల, 33 గ్రామ పంచాయతీల ఎన్నికల రిజర్వేషన్లు మళ్లీ మారే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం అమలు చేసిన 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు నాలుగు వారాల పాటు స్టే విధించిన విషయం తెలిసిందే. ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఎన్నికల అధికారులు నామినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. 42శాతం రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టే విధించడంతో నామినేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌లు పలువురికి కలిసి రావడంతో పోటీకి సిద్ధమయ్యారు. కోర్టు విధించిన స్టేతో గ్రామాల్లో ఎన్నికల సందడి తగ్గిపోయింది. అదేవిధంగా ఆశావహులకు చుక్కెదురైంది. మళ్లీ రిజర్వేషన్లు మార్చి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లలో కొందరికి కలిసి రాకపోవడంతో మళ్లీ ప్రకటించే రిజర్వేషన్లలో అయినా తమకు అనుకూలంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం పట్ల బీసీ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీలకు రాజకీయంగా ఎదగనివ్వకుండా అడ్డుకునేందుకు అగ్రవర్గాలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న 42శాతం బీసీ రిజర్వేషన్లు తగ్గే అవకాశం కనిపిస్తోంది. దీంతో అందరి దృష్టి మళ్లీ రిజర్వేషన్లపై పడింది. నిన్నటి వరకు గ్రామాల్లో రాజకీయ వాతావరణం నెలకొనగా ఒక్కసారిగా చల్లబడింది.

బీసీలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్

కులకచర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ ఆరోపించారు. కులకచర్ల బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్‌లతో స్థానిక ఎన్నికలను నిర్వహించినట్లే నిర్వహించి బీసీల నోటికాడి ముద్దను లాగేసుకుందని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా జీవో9 ఏర్పాటుచేసి ఉంటే హైకోర్టు స్టే ఇచ్చేది కాదు కానీ స్టే ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం కంగుతిందన్నారు. కోర్టు స్టే ఇవ్వడంతో ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో బీజేపీ పార్టీపై నెట్టేయాలని చూస్తుందన్నారు. అసెంబ్లీలో బీజేపీ మద్దతు తెలపలేదా అని ఆయన ప్రశ్నించారు. జీవో 9లో ట్రిపుల్ టెస్టను పాటించి ఉంటే స్టే వచ్చేదా? అని ప్రశ్నించారు. అదేవిధంగా చట్టబద్ధంగా మార్గదర్శకాలు పాటించకుండా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలనుకోవడం, ఆ తర్వాత స్టే రావడం ఇదంతా కాంగ్రెస్ చేయించిన కుట్రలో భాగమే అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, చంద్రలింగం, గాదె మల్లేశ్, శ్రీశైలం, పోమాల నరేశ్, వెన్నచెడ్ రాజు, మహేశ్, బైకాడి వెంకటేశ్, వెంకట్‌రాములు, వడ్డె చెన్నయ్య, శివాని చంద్రమౌళి, నరేశ్, శివ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోమిన్‌పేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో మోమిన్‌పేట్ నుంచి శంకర్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డు మరమ్మతు పనులను చేపట్టినట్లు మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్ తెలిపారు. స్పీకర్ చొరవతో అధ్వానంగా మారిన రోడు మరమ్మతు పనులను శనివారం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, నాయకులు మహేందర్, మహంతస్వామి, ఏజాజ్ పాష తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ పనులు..



భూమిపూజలో మాజీ సర్పంచ్ జగదీశ్, గ్రామస్తులు

తాండూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం గుంతబాస్పల్లి గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించేందుకు అదాని గ్రూప్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా శనివారం గ్రామ మాజీ సర్పంచ్ ఏర్పుల జగదీశ్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో దస్తయ్య గౌడ్ పాల్గొన్నారు.

'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మొగులయ్య

కులకచర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ మొగులయ్య అన్నారు. కులకచర్ల సొసైటీలో శనివారం సమావేశం నిర్వహించారు. నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపర్చడానికి ఈ పథకం ఉద్దేశమని రైతులకు అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు

కొడంగల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణంను ఘనంగా నిర్వహించారు. 107వ వారం పూర్తయిన సందర్భంగా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణంతో పాటు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజసేవ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి



ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజానికి సేవచేయాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామాల్లో సేవ చేయడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు విద్యార్థులు ప్రతీఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మానవసేవే మాధవసేవ అన్నారు. బర్కత్‌పురలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 50మంది వలంటీర్లు ప్రతాప్ సింగారంలో వారంరోజుల పాటు సేవా కార్యక్రమాలు చేశారు. ఎన్ఎస్ఎస్ ముగింపు కార్యక్రమంలో వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ అధికారి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సుమాకాంత్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కుసుమ, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బద్దం కుమార్, మాజీ ఉపసర్పంచ్ అబేదా బేగం, నాయకుడు నత్తి కృష్ణ, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మజీద్‌పూర్‌లో సేవా కార్యక్రమాలు

శామీర్‌పేట: మండలంలోని మజీద్‌పూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో శామీర్‌పేటలోని గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు సేవా కార్యక్రమాలను ఎంతో చురుగ్గా చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీన మజీద్‌పూర్‌లో ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ను ప్రారంభించిన విషయం విధితమే. ఈ క్యాంప్‌లో భాగంగా మూడో రోజు శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆరోగ్య శిబిరాన్ని, బాలికాదినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా, పెద్దఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ విచ్చేసి వలంటీర్ విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు యువతలో ఉన్న సేవా భావాలు పెంపొందించి సమజాభివృద్ధికి దోహదం చేస్తాయని మున్సిపల్ కమిషనర్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి బాలికల విద్యా ప్రాముఖ్యత, సమాన హక్కులు, భవిష్యత్తులో వారిపాత్రను వివరిస్తూ చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఎం ఆస్పత్రికి చెందిన వైద్యులు, పేషంట్ కేర్ కోఆర్డినేటర్ మంచినీళ్ళ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొని గ్రామ ప్రజలకు ఉచితంగా షుగర్ పరీక్షలను చేసి మందులను పంపిణీ చేశారు.



శామీర్‌పేట్: మజీద్‌పూర్‌లో ఆర్వీఎం వైద్యులతో వైద్య శిబిరం

సెంటర్ ఫర్ కల్చరల్ అండ్ రీసెర్చ్ శిక్షణలో ఉపాధ్యాయుడు



సెంటర్ ఫర్ కల్చరల్ అండ్ రీసెర్చ్ శిక్షణలో ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ కల్చరల్ అండ్ రీసెర్చ్ శిక్షణలో బొంరాస్‌పేట్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వంచర్ల శివరాజ్ పాల్గొన్నారు. పర్యావరణం, చారిత్రాక కట్టడాల పరిరక్షణపై శిక్షణలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా క్షేత్ర పర్యటన, ప్రాజెక్టు వర్క్, బోనాలు, బతుకమ్మ పండగల ప్రదర్శనను శనివారం సీసీఆర్‌టీ ఉదయ్‌పూర్ రాజస్తాన్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ఏడుగురు ఉపాధ్యాయుల బృందం ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కుమారస్వామి, రమేశ్, సుజాత, సోహన్‌లాల్, సంతోష్ పాల్గొన్నారు.

కరసేవకుల కవాతు



యాలాలలో పథ సంచలన్ నిర్వహిస్తున్న కర సేవకులు

యాలాల, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా శనివారం యాలాల మండల కేంద్రంలో యాలాల ఖండలో దండ సహిత గణవేష్ ధారి స్వయం సేవకులతో పథ సంచలన్ నిర్వహించారు. ఈ పథ సంచనంలో కర సేవకులు పుర వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో మండల స్వయం సేవకులు యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవీందర్, ఆకుల బస్వరాజ్, నాగారం పాండుగౌడ్, జంగం యాదగిరి, యాదయ్య, సిద్రామేశ్వర్, వీరేశం, బస్వరాజ్, భాస్కరచారి, బాయిమీది అశోక్, వెంకటగిరి రాజు, గొల్ల చందు, గడ్డం నర్సింహా, సాయి, అనిల్, నర్సింములు పాల్గొన్నారు.

విద్యాసంస్థలను కొనసాగించాలి

కొడంగల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కొడంగల్‌కు మంజూరైన విద్యాసంస్థలను యథావిధిగా కొనసాగించాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ నాయకులు కోరారు. మెడికల్, ఇంటిగ్రేటెడ్ గురుకులాలు లగచర్లకు తరలివెళ్తున్నాయని గత కొన్ని రోజులుగా వస్తున్న వార్తల నేపథ్యంలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు వెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య సమావేశాల్లో ఉండటంతో కలిసేందుకు అవకాశం లభించలేదు. కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి శివారులో మంజూరైన మెడికల్ కళాశాల, పాత కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ సీఎం కార్యాలయంలో అందించినట్లు వారు తెలిపారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా ఏర్పాటు చేయాలని వారు కోరారు.

మైనంపల్లిని కలసిన దోసకాయల వెంకటేశ్



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

శామీర్‌పేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా ఉద్దమర్రికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దోసకాయల వెంకటేశ్ శనివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్, నక్క ప్రభాకర్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ వారిని కలసి సన్మానించారు. మైనంపల్లి హనుమంతరావు, నక్క ప్రభాకర్‌గౌడ్‌లు కూడా వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలో నిరంతరం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి బాధ్యతగా కృషి చేస్తు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులకు దక్కేలా పార్టీ కార్యకర్తలతో కలసి బాధ్యతగా కృషి చేయాలని మైనంపల్లి వెంకటేశ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి, పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటగిరిప్రసాద్, బలవంత్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

వానలే వానలు!

(ఐదో పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. 2018-19 సంవత్సరంలో కేవలం 585 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో అప్పట్లో కరువు పరిస్థితి ఏర్పడింది. అనంతరం 2021లో నవంబరు నాటికి 1000.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే 2022లో అక్టోబరు నాటికి 1,166.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 2023లో నవంబరు నాటికి 941.6మిల్లీమీటర్లు, 2024లో డిసెంబరు నాటికి 1,115.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. కాగా, ఈ యేడాదిలో అత్యధికంగా అక్టోబరు నెలలో 355.8మిల్లీమీటర్ల వర్షం కురువగా అతి తక్కువగా మార్చి నెలలో 15మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



భూమి పూజలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

కులకచర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో బీసీ కమ్యూనిటి హాల్‌నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగారంలో సీసీరోడ్డు పనులను శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.